



అంపురంలో ఆర్టీసీ బస్సులో ప్రయాణికులతో మాట్లాడుతున్న షర్మిల

రాజశేఖర్‌రెడ్డి కొడుకే సీఎం.. పాలన అలా లేదు

- రాష్ట్రంలో దుర్మార్గపు తీరు గురించి చెప్పండి
- ప్రతి కార్యకర్త ప్రజలను ప్రభావితం చేయాలి
- పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పిలుపు
- ఇచ్ఛాపురంలో ప్రజాప్రస్థానం పాదయాత్ర

పైలాన్ నుంచే పర్యటన ప్రారంభం



ఇచ్ఛాపురంలో మాట్లాడుతున్న ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల



ఇచ్ఛాపురంలో పైలాన్ వద్ద అభివాదం

శ్రీకాకుళం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కొడుకే ఉన్నా.. రాష్ట్రంలో వైఎస్సార్ పాలనలా మాత్రం లేదని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. 'ఇచ్ఛాపురం నుంచి ఇడుపులపాయ' పర్యటనలో భాగం గా మంగళవారం ఉదయం శ్రీకాకుళం నుంచి 8.30 గంటలకు ఆమె ఇచ్ఛాపురం బయలుదేరారు. నరసన్నపేట, టెక్కలి, పలాస ప్రాంతాల్లో అభిమానులు ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం కంచిలి మండలం అంపురం జంక్షన్ వద్ద కాన్వాయ్ దిగి ఆర్టీసీ బస్సులో ఇచ్ఛాపురం వరకు ఆమె ప్రయాణించి ప్రయాణికులతో మాట్లాడారు. అనంతరం ఇచ్ఛాపురంలో వైఎస్సార్ ముగించిన ప్రజాప్రస్థానం పాదయాత్ర పైలాన్ వద్ద తన పర్యటనను ప్రారంభించారు. అక్కడ వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అక్కడ నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆర్తీ ఫంక్షన్ హాల్‌కు చేరుకుని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పేడాడ పరమేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. షర్మిల మాట్లాడుతూ తన తండ్రి వైఎస్సార్ ముగించిన ప్రజాప్రస్థానం పాదయాత్ర పైలాన్ వద్ద నుంచి తన పర్యటన ప్రారంభిస్తున్నానని వెల్లడించారు. రాష్ట్రంలో దుర్మార్గపు పాలన గురించి ప్రతి కార్యకర్త ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. ఒక్కో కార్యకర్త పలువురిని ప్రభావితం చేసి కాంగ్రెస్ పార్టీ వల్లనే ప్రజలకు, రాష్ట్రానికి మేలు కలుగుతుందని తెలియజేయాలని సూచించారు. 'ప్రజా ప్రస్థానం పాదయాత్ర ద్వారా ఉపాధి హామీ పథకం, ఆరోగ్యశ్రీ, పేదలకు ఇందిరమ్మ ఇళ్లు.. ఇవన్నీ రాజశేఖరరెడ్డి ప్రవేశ పెట్టారు. ఇప్పుడు యువకులకు ఉపాధి లేదు. ఉద్యోగావకాశాలు లేవు. ఇప్పటి వరకు రాజధాని నిర్మాణం లేదు. పోల వరం ప్రాజెక్టు పూర్తికాలేదు. కులాలతో సంబం ధం లేకుండా ప్రతి ఒక్కరికి మేలు జరగాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలి' అని షర్మిల అన్నారు. రాష్ట్రాభివృద్ధిపై చర్చకు తాము సిద్ధమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏపీ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్కం ఠాగూర్, మాజీ మంత్రులు రఘువీరారెడ్డి, జేడీ శీలం, పీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, కేవీపీ రామచంద్రరావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పేడాడ పరమేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సత్యవతి పాల్గొన్నారు.

పర్యటనలో వైసీపీ ద్వితీయశ్రేణి నాయకులు

ఊహించినట్లే అధికార పార్టీ వైసీపీకి.. పీసీసీ అధ్యక్షురాలి వల్ల నష్టం వాటిల్లనుందని షర్మిల పర్యటనలో తేటతెల్లమైంది. శ్రీకాకుళం నుంచి షర్మిల బయలుదేరగానే నరసన్నపేట, టెక్కలి, పలాస హైవే వద్ద ఆమెకు పలువురు స్వాగతం పలికారు. అందులో వైసీపీకి చెందిన ద్వితీయ స్థాయి నాయకులు, కార్యకర్తలే ఉన్నారు. అలాగే ఇచ్ఛాపురంలో వైసీపీ ఎంపీటీసీ స్వయంగా పాల్గొన్నారు. షర్మిల సమావేశంలో ఆ ఎంపీటీసీ మాట్లాడుతూ 'నాతోపాటు పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు. కొన్ని బిల్లుల బకాయిల వల్లన ఆలోచనలో పడ్డారు. సభకు హాజరైనవారిలో సగం మంది జనాన్ని వారే పంపించారు' అని వివరించారు. దీంతో ఎన్నికల సమయానికి వైఎస్సార్ అభిమానులు.. వైసీపీలో అసంతృప్తితో కొనసాగుతున్న కొంతమంది ద్వితీయశ్రేణి నాయకులు, కార్యకర్తలు షర్మిలకు మద్దతుగా నిలిచేందుకు కాంగ్రెస్‌పార్టీలో చేరడం ఖాయమని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఊహించిన దానికంటే పర్యటన విజయవంతం చేయడంపై జిల్లాకాంగ్రెస్ అధ్యక్షుడు పరమేశ్వరరావును ఈ సందర్భంగా షర్మిల అభినందించారు.

పల్లెవెలుగు బస్సులో షర్మిల

- అంపురం నుంచి ఇచ్ఛాపురం వరకు ప్రయాణం
- ప్రయాణికులతో మాటామంతీ

టెక్కలి, జనవరి 23: ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మంగళవారం పల్లెవెలుగు బస్సులో ప్రయాణించారు. ఇచ్ఛాపురం వెళ్లేందుకుగానూ కంచిలి మండలం జాతీయరహదారి అంపురం వద్ద ఆమె ఓ పల్లెవెలుగు బస్సు ఎక్కారు. ఆమెతో పాటు మాజీ పీసీసీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, రఘువీరారెడ్డి, ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి రాకేష్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు కూడా బస్సులో 23కిలోమీటర్లు మేర ప్రయాణించారు. పాపాలపుట్టుగకు చెందిన బి.పురుషోత్తం, జాడుపూడికి చెందిన కళ్యాణి, నీలవేణి, సదాశివరావు, ఈశ్వరమ్మ తదితర ప్రయాణికులతో అరగంట పాటు షర్మిల మాట్లాడుతూ.. యోగక్షేమాలు తెలుసుకుంటూ రాష్ట్ర ప్రభుత్వ పాలనా తీరుపై ఆరాతీశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ నూనెలు, చక్కెర తదితర నిత్యావసర వస్తువుల ధరలతోపాటు, గ్యాస్, విద్యుత్, బస్సు చార్జీలు బాగా పెరిగినట్టు ప్రయాణికుల ద్వారా తెలుసుకున్నానని వివరించారు.

- బస్సులో పక్క సీట్లో కూర్చొన్న నీలవేణి అనే ప్రయాణికులతో షర్మిలతో మాట్లాడారు. 'తల్లీ నమస్తే. నువ్వు ఏమి చేస్తుంటావు. నీ భర్త ఏమి చేస్తారు. వ్యవసాయానికి సాగునీరు ఉందా?. ఆదాయం ఎంత వస్తోంద'ని షర్మిల అడిగారు. తాను గృహిణిగా ఉంటూ వ్యవసాయం చేస్తున్నానని ప్రయాణికురాలు నీలవేణి తెలిపారు. వ్యవసాయంలో ఖర్చు పెరగ్గా ఆదాయం తగ్గిందన్నారు. మీరు అధికారంలోకి వచ్చిన తర్వాత కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల మాదిరి ఈ రాష్ట్రంలో కూడా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాలని కోరారు. తప్పకుండా అమలు చేస్తామని షర్మిల స్పష్టం చేశారు.
- బస్సులోని వెనుక సీట్లో ఉన్న బారువ ప్రాంతానికి చెందిన మరో ప్రయాణికుడు బి.సదాశివరావును 'అన్నా బాగున్నారా' అంటూ షర్మిల ఆప్యాయంగా పలకరించారు. బాగున్నా అమ్మా అంటూ సదాశివరావు కూడా ప్రతి నమస్కారం చేశారు. 'ఈ ఐదేళ్లలో కొత్త కాలనీలు ఏమైనా ఇచ్చారా? మద్యం విక్రయాలు జరుగుతున్నాయా? మద్యపాన నిషేదం హామీ గుర్తుందా?' అని షర్మిల అడిగారు. దీనిపై సదాశివరావు బదులిస్తూ కొత్త కాలనీలు పెద్దగా లేవమ్మా అని తెలిపారు. నాసిరకం మద్యం విక్రయిస్తున్నారని, మద్యపాన నిషేదం హామీ గాలిలో కలిసిపోయిందని వివరించారు.
- బస్సులో బారువ కొత్తూరుకు చెందిన సిరిగిడి ఈశ్వరమ్మ అనే ప్రయాణికురాలిలో షర్మిల మాట్లాడారు. 'మీ ఎమ్మెల్యే ఎప్పుడైనా మీ ఊరు వచ్చారా?. మీ ప్రాంతంలో ఏమైనా అభివృద్ధి చేశారా?. మీ కుటుంబ ఆర్థిక పరిస్థితి ఏంటి' అని ఆరా తీశారు. దీనిపై ప్రయాణికులు ఈశ్వరమ్మ మాట్లాడుతూ.. ఓట్లు అడిగినప్పుడు మాత్రమే ఎమ్మెల్యే వచ్చారని.. తర్వాత కనిపించలేదని తెలిపారు. మా ప్రాంతంలో అంతంతమాత్రమే అభివృద్ధి చేశారని, ప్రస్తుతం నిత్యావసర వస్తువుల ధరలన్నీ పెరగడంతో కుటుంబ పోషణ భారమవుతోందన్నారు.



మార్గమధ్యలో ప్రజలతో కరచాలనం చేస్తున్న వైఎస్ షర్మిల

మద్దతు ధర ఏదీ?

- పత్తి రైతుల ఆవేదన
- గిట్టుబాటు కల్పించాలని విజ్ఞప్తి

(సరుబుజ్జిలి)



పత్తి పంట

పత్తి సాగు చేసే రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఓ వైపు పెట్టుబడి పెరగ్గా.. మరోవైపు ఆశించిన స్థాయిలో మద్దతు ధర లభించక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒకప్పుడు గుంటూరు, కృష్ణ, ప్రకాశం జిల్లాల్లో ఎక్కువశాతం రైతులు పత్తి పండించేవారు. మొదట్లో ఆశాజనకంగా ఉన్నా, క్రమేపీ పత్తిసాగుకు పెట్టుబడి, కౌలు చెల్లింపులు రైతులకు ప్రధాన సమస్యలుగా మారాయి. దీంతో చాలామంది రైతులు పత్తి పంటను విడిచి పెట్టేశారు. ఆయా జిల్లాలకు చెందిన కొంతమంది రైతులు శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చేరుకుని.. తక్కువ కౌలుకు భూములు తీసుకుని పత్తి సాగు చేశారు. దీంతో స్థానిక రైతులు కూడా పత్తిసాగుపై ఆసక్తి చూపారు. సరుబుజ్జిలి మండలంలోని చిగురువలస, నందికొండ, మర్రిపాడు, శ్రీరామవలస, వెన్నెలవలస, లక్ష్మీపురం, తాడికొండలోని మెట్టు భూములతోపాటు బూర్జ మండలం అన్నంపేట గ్రామానికి చెందిన రైతులు 300 ఎకరాల్లో గత 15 ఏళ్లుగా పత్తి సాగు చేస్తున్నారు. ఎకరా భూమికి వివిధ రకాల పెట్టుబడితో పాటు భూమి కౌలు చెల్లింపులతో సుమారు ఎకరానికి రూ.30వేల వరకు ఖర్చు చేస్తున్నారు. ప్రకృతి అనుకూలిస్తే ఎకరాకు పది క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తోంది. గతంలో పత్తి ధర క్వింటాకు మద్దతు ధర రూ.9వేల నుంచి రూ.10వేలు ఉండేదని, ఈ ఏడాది రూ.6వేల నుంచి రూ.6,500 వరకు అడుగుతున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా బత్తిలి, రాజాం ప్రాంతాలకు చెందిన దళారులు పత్తి పంట ధరలను అమాంతంగా దివాలా తీసి తమను కోలుకోలేకుండా చేస్తున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికా రులు, ప్రజాప్రతినిధులు స్పందించి పత్తిపంటకు మద్దతు ధర కల్పించాలని కోరుతున్నారు.

మద్దతు ధర కల్పించాలి



ఈ ఏడాది పత్తి పంట కొంతమేర దిగుబడి వచ్చినా, ప్రభుత్వం సరైన మద్దతు ధర కల్పించలేదు. ఇప్పుడు ఉన్న ధరతో సాగుకు పెట్టిన డబ్బులు కూడా రావు. మద్దతు ధర కల్పించాలి.
- మజ్జి అప్పన్న, రైతు, అన్నంపేట, బూర్జ

అప్పులు తీరుతాయన్న నమ్మకం లేదు



పది ఎకరాల భూమి కౌలుకు తీసుకొని కుటుంబ సభ్యులతో పాటు కొంతమంది కూలీలను పెట్టి అధిక పెట్టుబడులతో పత్తి సాగు చేశాం. ప్రస్తుతం ధర అనుకూలంగా లేదు. అప్పులు తీరుతాయన్న నమ్మకం లేదు.
- నేతింటి శేఖర్, చిగురువలస, రైతు, సరుబుజ్జిలి

నత్తనడకన.. కులగణన

- జిల్లాలో సక్రమంగా సాగని సర్వే
- సర్వర్ సమస్యతో ఇబ్బందులు
- ఎలాగైనా చేయాల్సిందేనని సిబ్బందిపై అధికారుల ఒత్తిడి
- లేదంటే షోకాజ్‌లు జారీ చేస్తామని బెదిరింపులు



మెళియాపుట్టి : పెద్దపద్మాపురంలో రాత్రివేళ కులగణన సర్వే..

(శ్రీకాకుళం అర్బన్/ మెళియాపుట్టి)

జిల్లాలో కులగణన సర్వేకు సర్వర్ సమస్య వేధిస్తోంది. సర్వే ప్రారంభించి ఐదు రోజులు కావస్తున్నా సర్వర్ సమస్యతో కులగణన సక్రమంగా సాగడం లేదు. కొన్ని చోట్ల కుటుంబ యజమాని వేలిముద్రలు యాప్‌లో అప్‌లోడ్ కాకపోవడంతో సచివాలయ సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో 732 సచివాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో 7,38,704 కుటుంబాల్లో 21,75,086 మంది జనాభా వరకు ఉన్నారు. కులగణన సర్వే సక్రమంగా జరగడానికి వీలుగా 12,503 క్లస్టర్లు ఏర్పాటు చేశారు. ఈ నెల 19 ప్రారంభమైన సర్వే ఈ నెల 28 వరకు సాగనుంది. జిల్లా గణంకాల అధికారి ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులు, గ్రామ,వార్డు వలంటీర్లు సర్వే చేపడుతున్నారు. మారుమూల, కొండలపై ఉన్న గ్రామాల్లో నెట్‌వర్క్ సక్రమంగా ఉండకపోవడంతో కులగణనకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ గ్రామాల్లో ముందుగా ప్రజల వివరాలు సేకరించి, ఆ తరువాత నెట్ సిగ్నల్స్ బాగా ఉన్న ప్రాంతానికి వచ్చి యాప్‌లో నమోదు చేస్తున్నారు. కొన్నిచోట్ల అధికారుల ఒత్తిడిని తట్టుకోలేక.. మరోవైపు నెట్‌వర్క్ సక్రమంగా పనిచేయక సతమతమవుతున్నారు.

- మెళియాపుట్టి మండలం పడ్డ, వెంకటాపురం పంచాయతీల్లో నెట్‌వర్క్ సక్రమంగా ఉండదు. దీంతో కులగణన సర్వే చేపట్టేందుకు సచివాలయ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఇంటింటికీ వెళ్లి సర్వే చేయకుండా సిగ్నల్స్ వచ్చేచోటుకు గ్రామస్థులను పిలిచి కులగణన వివరాలను నమోదు చేస్తున్నారు.
- ఇదే మండలంలోని పెద్దపద్మాపురం గ్రామంలో సర్వర్ సక్రమంగా పని చేయకపోవడంతో సర్వేకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో సచివాలయ సిబ్బంది రాత్రి సమయంలో కులగణన చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఒకపక్క అధికారుల ఒత్తిడి.. మరోపక్క నెట్‌వర్క్ సమస్యతో సిబ్బంది తీవ్ర ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో చాలాచోట్ల ఇదే పరిస్థితి నెలకొంది.



శ్రీకాకుళం చేపలవీధిలో ఉదయం 6 గంటలకే సర్వే చేస్తున్న దృశ్యం

అమ్మో ఇన్ని వివరాలా..

కులగణన సర్వేకు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాట్లు పడుతున్నారు. యాప్‌లో నమోదు చేయాల్సిన వివరాలను చూసి అమ్మో అని భయపడుతున్నారు. నివాసితుల పేరు, తండ్రిపేరు, పుట్టిన తేదీ, వైవాహిక స్థితి, కులం, ఉపకులం, మతం, విద్యార్హత, వృత్తి వివరాలతో పాటు వ్యవసాయ భూమి లేదా నివాస స్థలం ఉందా, కుటుంబ సభ్యులు అందుబాటులో ఉన్నారా?, శాశ్వతంగా వలస వెళ్లారా?, కుటుంబ పెద్దపేరు, ఆధార్ నెంబర్, సభ్యులు వివరాలు, నివాస ఇళ్ల స్థితి, మరుగుదొడ్లు, తాగునీరు సదుపాయం, పశు సంపద, వంట చేసే విధానం తదితర వివరాలు యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఇన్ని వివరాలను ప్రజలను అడిగి వాటిని నమోదు చేసేందుకు సర్వే సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. సర్వర్ సమస్యతో వివరాల నమోదుకు తీవ్ర జాప్యమవుతోందని ఆందోళన చెందుతున్నారు.

రాత్రి పూట సర్వే

ప్రతి సచివాలయం పరిధిలో ఇళ్ల సంఖ్య ప్రాతిపదికన ఇద్దరు వలంటీర్లకు ఒక సచివాలయ సెక్రటరీని ఇచ్చి కులగణన చేపడుతున్నారు. ఒక సెక్రటరీ 800 నుంచి 1000 ఇళ్లల్లో కులగణన సర్వే చేయాల్సి ఉంది. వలంటీర్ లాగిన్‌లో కులగణన సర్వే యాప్‌లో రెండు స్టేజ్‌ల్లో 18రకాల వివరాలను నమోదు చేయాలి. ప్రతి స్టేజ్‌లోనూ వలంటీర్‌తో పాటు సెక్రటరీ వేలిముద్ర వేయాలి. సాంకేతిక సమస్యలతో సర్వే ఆలస్యంగా జరుగుతోంది. ఈ నెల 20నాటికి ఒక్కో వలంటీర్‌కు 3 శాతం కూడా సర్వే పూర్తి కాలేదంటే సర్వర్లు ఏ స్థాయిలో మొరాయించాయో అర్థం చేసుకోవచ్చు. దీనికి సచివాలయ సెక్రటరీలు, వలంటీర్లను బాధ్యులను చేస్తూ ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 5 గంటల నుంచి 10 గంటల వరకు సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు నెట్‌వర్క్‌లు వేగవంతంగా పని చేస్తాయని, ఆ సమయంలో సర్వేలు చేయాలని ఆదేశించారు. సర్వేలు తక్కువగా చేసిన సచివాలయ సిబ్బంది వివరాలను ఎంపీడీవోలు/ఎంసీలు తెలపాలని, అటువంటి వారికి షోకాజ్‌లు జారీ చేస్తామని సామాజిక మాద్యమాల్లో హెచ్చరికలు జారీ చేశారు. దీంతో ఆదివారం సెలవు రోజూ కూడా సర్వే చేశారు. కులగణన సర్వే ఈ నెల 28 వరకు చేయాల్సి ఉండగా అధికారులు మాత్రం ఒత్తిడికి గురి చేస్తున్నారని సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వలంటీర్లలో సగానికి పైగా మహిళలు ఉన్నారు. వారిని రాత్రి పూట పని చేయాలని ఆదేశించడంపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు సైతం సమయపాలన లేకుండా ఈ సర్వేలు ఏంటని సచివాలయ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నెట్‌వర్క్ ఉన్నచోట చేయాలి

నెట్‌వర్క్ బాగా ఉన్న ప్రాంతాలకు ప్రజలను తీసుకువచ్చి కులగణన సర్వే చేయాలి. పింఛన్లు, రేషన్‌కు సంబంధించి బయోమెట్రిక్ వేసే విధంగా కులగణన చేయాలని సిబ్బందికి సూచించాం.
- చంద్రకుమారి, ఎంపీడీవో, మెళియాపుట్టి

టీడీపీతోనే అభివృద్ధి సాధ్యం

- పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు



ప్రజలతో మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, జనవరి 23: టీడీపీ ప్రభుత్వంతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మంగళవారం కోటబొమ్మాళి మండలం కురుడు పంచాయతీ యరకయ్యపేట, బావాజీపేట, రామయ్యపేట, మెండపేట, పొన్నాడపేట తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ మేనిఫెస్టోను, చంద్రబాబు అధికారంలోకి వస్తే అందించనున్న సంక్షేమ పథకాలను వివరించారు. వైసీపీని సాగనంపి.. టీడీపీని గెలిపించాలని కోరారు. అలాగే నిమ్మాడలోని క్యాంపు కార్యాలయంలో అచ్చెన్నను టెక్కలి, సంతబొమ్మాళి, నందిగాం, టెక్కలి మండలాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బోయిన రమేష్, టీడీపీ నాయకులు వెలమల కామేశ్వరావు, విజయలక్ష్మి, తర్ర రామకృష్ణ, గొండు లక్ష్మణరావు, పూజారి శైలజ, బాడాన రమణమ్మ, వాన లక్ష్మి, దేవాది సింహాద్రి, బెండి అన్నపూర్ణ, నాళ్ల ఆది నారాయణ, నర్సింగరావు, కింజరాపు హరివరప్రసాద్, నంబాళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఇచ్ఛాపురంలో బైక్ ర్యాలీ

ఇచ్ఛాపురం/రూరల్: టీడీపీ హయాంలో ప్రవేశపెట్టిన పథకాలనే ప్రస్తుత ప్రభుత్వం పేర్లు మార్చి అమలు చేస్తోందని ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఆరోపించారు. వైసీపీ పాలనలో బీసీలకు గుర్తింపు లేదన్నారు. మంగళవారం ఇచ్ఛాపురంలోని స్వేచ్ఛావతి అమ్మవారిని దర్శించుకున్నారు. తర్వాత బస్టాండ్ కూడలిలో ఎర్రన్నాయుడు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే అశోక్‌తో కలిసి బైక్‌ర్యాలీ నిర్వహించగా.. విశేష స్పందన లభించింది. ర్యాలీలో అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. వారిద్దరి సమక్షంలో వైసీపీకి చెందిన 150 కుటుంబాలు టీడీపీలో చేరాయి.

టీడీపీతోనే బీసీలకు న్యాయం

● ఎంపీ రామ్మోహన్ నాయుడు

ఇచ్ఛాపురం/రూరల్: టీడీపీతోనే బీసీలకు న్యాయం జరిగిందని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. ఇచ్ఛాపురంలో జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. నాడు ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల పేర్లు మార్చి ఇప్పుడు వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. కార్పొరేషన్ల పేరుతో వైసీపీ నాయకులకు పదవులు ఇచ్చారే తప్ప, బీసీలను గుర్తించలేదని విమర్శించారు. అలాంటి వ్యక్తి మనకు ముఖ్యమంత్రిగా ఉండడం బాధాకరమన్నారు. జగన్‌రెడ్డి వదిలిన బాణం షర్మిల అని, ఇప్పుడు ఆ బాణమే ఊరూరా తిరుగుతూ అన్నను నమ్మొద్దని ప్రచారం చేస్తున్నప్పుడు, మనమెందుకు నమ్మాలన్నారు. కేవలం డబ్బు సంపాదనే లక్ష్యంగా పరిపాలన చేస్తున్నారన్నారు.



ఇచ్ఛాపురం/రూరల్: వైసీపీ నేతలకు పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న ఎంపీ రామ్మోహన్, ఎమ్మెల్యే అశోక్

వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరిక

బీసీ సాధికార కమిటీ రాష్ట్ర కన్వీనర్ కొండా శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన ఆసి చిరంజీవులు రెడ్డి, నందికి రామచంద్రా రెడ్డి, నీలాపు వెంకట రెడ్డి, శ్రీను, డి.రాజా రెడ్డి, బి.రామయ్య, ఉప్పాడ గిరి, తిప్పన గిరి, వెంకటేష్‌లతో పాటు మరో 150 కుటుంబాలు టీడీపీలో చేరారు. వీరికి ఎంపీ, ఎమ్మెల్యేలు కండువాలతో పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి సాలిన ఢిల్లీ, నాయకులు సదానంద రౌళో, దక్కత ఢిల్లీరావు, సాడి సహదేవు రెడ్డి, మణిచంద్ర ప్రకాష్, సీపాన వెంకటరమణ, పొందల కృష్ణారావు, శివంగి గణపతి, దున్న లోకనాథం, కౌన్సిలర్ ఆసి లీలారాణి, కాళ్ల జయదేవు తదితరులు పాల్గొన్నారు.

రెడ్ల రాజ్యంలో బీసీలకు అన్యాయం: శిరీష

వజ్రపుకొత్తూరు: రాష్ట్రంలో సాగుతున్న రెడ్డి రాజ్య పాలనలో బీసీలకు తీరని అన్యాయం జరుగుతోందని టీడీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గౌతుశిరీష అన్నారు. మంగళవారం బాతుపురంలో జయహో బీసీ కార్యక్రమం టీడీపీ మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో బీసీలకు 34 నుంచి 24 శాతానికి రిజర్వేషన్ తగ్గించి బీసీలకు మోసం చేశారని విమర్శించారు. అన్ని ముఖ్యమైన పదవుల్లో రెడ్డిలను నియమించి జగన్ రెడ్డి బీసీ కులాల కోసం మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. పలాసకు మంత్రిగా ఉన్న అప్పల రాజు బీసీలను అణగదొక్కేందుకు ప్రయత్నిస్తున్నారని, మత్స్యకార మంత్రిగా ఉండి వారి పథకాలను తొలగించి కేసులు పెట్టడం దారుణమన్నారు. టీడీపీ హయాంలో బీసీలకు తగిన గుర్తింపు ఇవ్వడంతో పాటు పలు ఉన్నత పదవుల్లో వారినే నియమించారని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. అనంతరం బాతుపురం, పెదవంక గ్రామాలకు చెందిన 50 మంది యువకులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారికి శిరీష పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు పీరుకట్ల విఠల్, దువ్వాడ హేమబాబు చౌదరి, పుచ్చ ఈశ్వరరావు, కణితి సురేష్, అర్సవెల్లి ఉమామహేశ్వరరావు, బత్తిని మోహనరావు, తామాడ ప్రదీప్, జయరాం చౌదరి, నెయ్యిల సూర్యనారాయణ, బుల్లోజు శశిభూషణ్, కోనేరు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ విజయమే లక్ష్యం: రవికుమార్

బూర్జ: రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. మంగళవారం బూర్జలో జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యకర్తలకు గెలుపు ధీమా ఉండకూడదన్నారు. పార్టీలోకి ఎవరు వచ్చినా చేర్చుకొని పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. బీసీలకు టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వారి సమస్యలు పరిష్కరిస్తామని హామీనిచ్చారు. గ్రామాల్లో వైసీపీ నాయకులు నమోదు చేయించిన దొంగ ఓట్లను వెలికితీయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు రాంజీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, నియోజకవర్గ పరిశీలకుడు వజ్జ బాబూరావు, మాజీ జడ్పీటీసీ అనెపు రామకృష్ణంనాయుడు, నేతలు వేపార వెంకటేష్, గోవిందరావు, జగదీష్, హరి గోపాల్, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డొంకలపర్త గ్రామానికి చెందిన వైసీపీ నేత జద్దు నారాయణరావు తోపాటు బూర్జ మండల కేంద్రంలో 50 కుటుంబాలు టీడీపీలో చేరారు. వీరికి రవికుమార్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.



బూర్జ: పార్టీలో చేరిన వారితో కూన రవికుమార్

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం: బగ్గు

చీడివలస(పోలాకి): టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి అన్నారు. మంగళవారం సాయంత్రం చీడివలస, జిల్లేడు వలస, మాకివలస, గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ' నిర్వహించారు. కార్యక్రమంలో ఐటీడీపీ కన్వీనర్ బగ్గు అర్చన, బైరి భాస్కరరావు, ఎంవీ నాయుడు, ఆర్.కే.నాయుడు, ఎస్.నారాయణదాస్, మాజీ సర్పంచ్ జడ్డెన్న, యాళ్ల అసిరినాయుడు, గొల్లంగి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు. ● **జలుమూరు:** టీడీపీ అధినేత చంద్రబాబు నాయకత్వంలోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని ఆ పార్టీ యూనిట్ ఇన్‌చార్జి బోడేల బాలకృష్ణ అన్నారు. రామయ్యవలసలో మంగళవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైసీపీ వైఫల్యాలను, టీడీపీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు గొద్దు రమణమూర్తి, మొయ్యి శ్రీనివాసరావు, గోవిందరావు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



రామయ్యవలసలో భవిష్యత్తు గ్యారెంటీ నిర్వహిస్తున్న నేతలు

జలుమూరు (సారవకోట): టీడీపీ అధినేత చంద్రబాబుతోనే యువత భవిష్యత్తుకు గ్యారెంటీ లభిస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ అన్నారు. అలుదు గ్రామంలో మంగళవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చల్ల ఆనందరావు, జాన నాగరాజు, సాధు చిన్నికృష్ణంనాయుడు, కోన వెంకటేష్, తాడేల భీమారావు తదితరులు పాల్గొన్నారు.

పలాసరూరల్: టీడీపీతోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నాయకులు అన్నారు. రెంటికోట, లొత్తూరు, కాంట్రగడ పంచాయతీల్లో మంగళవారం పల్లెపల్లెకు టీడీపీ, బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ చేపట్టారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పీరికట్ల విఠల్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు కుత్తుమ లక్ష్మణ్‌కుమార్, దువ్వాడ సంతోష్‌నాయుడు, సవర సోమేశ్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. పలాస మండలం సరియాపల్లిలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ఆధ్వర్యంలో మంగళవారం 30 కుటుంబాలు టీడీపీలో చేరాయి. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.



మొగిలిపాడులో 'పల్లెపల్లెకు టీడీపీ' నిర్వహిస్తున్న నేతలు

ప్రతి ఇంటికీ ప్రభుత్వ అరాచకాలు

పలాస: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ అరాచకాలు, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతి ఇంటికీ వెళ్లి వివరిస్తామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్ అన్నారు. పట్టణంలోని ఒకటో వార్డు మొగిలిపాడు గ్రామంలో మంగళవారం 'పల్లెపల్లెకు టీడీపీ' కార్యక్రమం నిర్వహించారు. పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి గాలి కృష్ణారావు, నేతలు బడ్డ నాగరాజు, అంబటి కృష్ణమూర్తి, దడియాల నర్సింహులు, కుమ్మరి శివాజీ, బర్ల ప్రసాదరావు, యవ్వారి మోహనరావు, బి.ఉమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే మత్స్యకారుల సంక్షేమం

సంతబొమ్మాళి: టీడీపీతోనే మత్స్యకారుల సంక్షేమం సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు జీరు భీమారావు, రెడ్డి అప్పన్న అన్నారు. మంగళవారం లక్కివలసలో మత్స్యకారులతో సమావేశం నిర్వహించారు. టీడీపీ హయాంలో మత్స్యకారులకు సబ్సిడీపై వలలు, బోట్లు, డీజిల్ రవాణా వాహనాలు అందించామన్నారు. రానున్న ఎన్నికల్లో మత్స్యకారులంతా టీడీపీకి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చిదపాన ధర్మార్జునరెడ్డి, మత్స్యకార నాయకులు సూరాడ ధనరాజ్, భీమారావు, వంగ అశిరినాయుడు, సువ్వారి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మత్స్యకారులతో సమావేశమైన టీడీపీ నాయకులు



వజ్రపుకొత్తూరు: వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారితో శిరీష



పోలాకి: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



జలుమూరు (సారవకోట): కరపత్రాలు అందిస్తున్న నేతలు



పలాస రూరల్: పథకాల అమలు గ్యారెంటీ కార్డును అందజేస్తున్న దృశ్యం

ఉత్కళాంధ్రుల కళా సంస్కృతిని పరిరక్షించాలి

● రిటైర్డ్ డీఎస్పీ ప్రసాదరావు

మందస: ఉత్కళాంధ్రుల కళా సంస్కృతిని పరిరక్షించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని రిటైర్డ్ డీఎస్పీ శమల్ల ప్రసాదరావు అన్నారు. బుడార్సింగి రామమందిరం ఆవరణలో ఒడియా కళాకారుల సమ్మేళనం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉత్కళాంధ్రుల సంస్కృతి అభివృద్ధికి ఒడియా కళాకారుల సంఘం చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. అనంతరం ఉత్కళాంధ్ర కళాకారులు జలంధర సాహు, ఖగేశ్వర గౌడ తదితరులు వివిధ కళా ప్రదర్శనలు నిర్వహించారు. చిన్నారులు ఒడియా రామ భజన, కీర్తనలను ఆలపించారు. కళాకారులను నిర్వాహకులు అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ సురేష్ పాణిగ్రాహి, ఏపీ, ఒడియా కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తిరుపతి సాహు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమార్ నాయక్, రోషన్ సుభాష్, ఒడియా సినీ గాయకుడు రమేష్ సహనీ, మాజీ సర్పంచ్ కురగౌడో, నల్ల నీలకంఠ తదితరులు పాల్గొన్నారు.



రిటైర్డ్ డీఎస్పీని సత్కరిస్తున్న నిర్వాహకులు

శాంతానందస్వామి అస్తమయం

నరసన్నపేట: ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, రామకృష్ణ మఠం (జమ్ము) పీఠాధిపతి శాంతానంద స్వామి (92) అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం తెల్లవారుజామున పరమపదించారు. స్వామి వివేకానంద స్ఫూర్తితో బ్రహ్మచర్యం పాటించి, సంతబొమ్మాళి మండలం చెట్లతాండ్ర, నరసన్నపేట మండలం గెడ్డవానిపేట, జమ్ము గ్రామాల వద్ద మఠాలను ఏర్పాటు చేసి సనాతన హిందూ ధర్మ వ్యాప్తికి కృషి చేశారు. శాంతానంద స్వామి పరమపదించడంపై శిష్యులు సంతాపం తెలిపారు.



శాంతానందస్వామి (ఫైల్)

సాగునీరు లేక రైతులకు తీవ్ర నష్టం

టెక్కలి రూరల్: గోపినాథపురంలో వంశధార కాలువలను నాలుగేళ్లుగా మరమ్మతులు చేపట్టకపోవడంతో సాగునీరందక వందలాది ఎకరాలు ఎండిపోయి రైతులు నష్టపోతున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఎంపీటీసీ సభ్యురాలు సత్తారు ఉషారాణి వంశధార అధికారులను ప్రశ్నించారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ అట్ల సరోజినమ్మ అధ్యక్షతన మంగళవారం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హుద్‌హుద్ ఇళ్లకు విద్యుత్ సదుపాయం కల్పన, హుద్‌హుద్ ఇళ్ల రెండో విడత పంపిణీపై ఎంపీటీసీ ఉషారాణి అధికారులను ప్రశ్నించారు. పట్టణంలోని పలు వీధుల్లో రేషన్ సరఫరా సక్రమంగా జరగడం లేదని, మూలపేట పోర్టు వాహనాల వల్ల రోడ్లు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. సమావేశంలో తహసీల్దార్ కె.ప్రవల్లిక ప్రియ, ఎంపీడీవో చింతాడ లక్ష్మీబాయి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రెంటికోట కాలనీలో 'జనసేన ప్రభంజనం'

పలాసరూరల్: రెంటికోట కాలనీలో జనసేన ఆధ్వర్యంలో 'జనంజనం..జనసేన ప్రభంజనం' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో జనసేన-టీడీపీ కూటమికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పలాస నియోజకవర్గ జనసేన నాయకుడు డాక్టర్ దుర్గారావు, ధర్మారావు, బబ్లూ, దిలీప్ కుమార్, దుర్యోధనరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల పక్షానే టీడీపీ: కలమట

మెళియాపుట్టి: టీడీపీ ఎప్పుడూ ప్రజాపక్షమే అని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణమూర్తి అన్నారు. సంతలక్ష్మీపురం, భరణికోట, సవరకొలిగాం, గొప్పిలి, కరజాడ, ముక్తపురం, గోకర్ణ పురం, మర్రిపాడు-కె, చీపురుపల్లి గ్రామాల్లో టీడీపీ, జనసేన నేతలతో కలిసి సమావేశాలు నిర్వహించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. **పాతపట్నం:** రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని మాజీఎమ్మెల్యే కలమట వెంకటరమణ మూర్తి కోరారు. పాతపట్నం లో మంగళవారం మండల, క్లస్టర్ యూనిట్ ఇన్‌చార్జిలు, బూత్ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. అధికార పార్టీ నాయకులు ఓటరుజాబితాలో అక్రమాలకు పాల్పడకుండా అడ్డుకోవాలన్నారు. కార్యక్రమంలో బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైల లక్ష్మయ్య, పార్టీ పట్టణాధ్యక్షుడు సైలాడ సతీష్, మాజీ ఎంపీపీ కొల్లా శారద, నాయకులు మడ్డు రామారావు, కర్రి అప్పారావు, నల్లి రాజారావు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

వజ్రపుకొత్తూరు: సుంకరజగన్నాథపురానికి చెందిన టెంక ఆదినారాయణ (36) కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ మధుసూదన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఆదినారాయణకు 2018లో వివాహమైంది. భార్య పద్మావతితో తరచూ తగాదాలు జరుగుతుండేవి. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. దీంతో ఆయన వేరుగా ఉంటున్నాడు. ఇటీవల తగాదాలు తారస్థాయికి చేరడంతో మంగళవారం గ్రామ సమీపంలోని జీడి తోటలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే ఆదినారాయణ ఆత్మహత్యకు భార్య, అత్త, బావమరిది వేధింపులే కారణంగా ఆయన కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ఆసుపత్రికి తరలించారు. మృతుడి తల్లి టెంక రెయ్యమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారి ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ మధుసూదన్

షర్మిలకు ఘన స్వాగతం

నరసన్నపేట/టెక్కలి/పలాస: పీసీసీ అధ్యక్షురాలిగా పదవీ బాధ్యతలు స్వీకరించి తొలిసారిగా జిల్లా పర్యటనకు వచ్చిన వైఎస్ షర్మిలకు పలు ప్రాంతాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. నరసన్నపేట మండలం తామరాపల్లి హైవేపై నియోజకవర్గ నాయకుడు, పార్టీ జిల్లా కార్యదర్శి దుప్పట్ల మధుసూదనరావు, కొర్రాయి ప్రసాదరావు, మహిళలు స్వాగతం పలికారు. అలాగే టెక్కలిలో షర్మిలకు డీసీసీ అధ్యక్షుడు పేడాడ పరమేశ్వరరావు తదితరులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా టెక్కలి నియోజకవర్గ నాయకులు, కిసాన్ సెల్ అధ్యక్షుడు కోత మధు, పొట్నూరు ఆనందరావు, చింతాడ దిలీప్, కవిటి గోపాలకృష్ణ, లింగరాజు, భాస్కర్ బాబు తదితరులను ఆమెకు పరిచయం చేశారు. పలాస మండలం మొగిలిపాడు వద్ద జాతీయ రహదారిపై కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎస్. సురేష్ కుమార్ ఆధ్వర్యంలో నేతలు, కార్యకర్తలు ఆమెకు స్వాగతం చెప్పారు. ఆమెకు కండువా వేసి ఆహ్వానించారు. కాంగ్రెస్ బలోపేతానికి అంకిత భావంతో పని చేయాలని షర్మిల వారిని కోరారు. స్వాగతం పలికిన వారిలో కాంగ్రెస్ నాయకులు టి.మధు, వీర్రాజు, చంటి, బబ్లూ తదితరులు పాల్గొన్నారు.





నరసన్నపేట, పలాసల్లో షర్మిలకు స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నాయకులు

కొలతల ప్రకారం వేతనాలు వచ్చేలా చర్యలు

● ట్రైనీ కలెక్టర్ రాఘువేంద్ర మీనా

కోటబొమ్మాళి: ఉపాధి హామీ పనులు చేపడుతున్న వేతనదారులకు కొలతల మేరకు వేతనాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ట్రైనీ కలెక్టర్ రాఘువేంద్ర మీనా ఆదేశించారు. నీలంపేటలో చేపడుతున్న ఉపాధి పనులను ఎంపీడీవో కె.ఫణీంద్ర కుమార్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పని విధానం, పని ప్రదేశంలో తాగునీరు, ఫస్ట్ ఎయిడ్, నీడ సదుపాయం ఏర్పాటు తదితర అంశాలపై ఆరా తీశారు. గిట్టుబాటుపై ఉపాధి హామీ ఏపీవో అరుణ్ కుమార్‌ను అడిగి తెలుసుకునానరు. కార్యక్రమంలో ఉపాధి జేఈ జి.హరిప్రసాద్, టి.రాంబాబు, కె.కుమార్ స్వామి, ఎస్.కనవయ్య తదితరులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్

విద్యా వైజ్ఞాన సదస్సులో విద్యార్థినుల ప్రతిభ

హిరమండలం: శ్రీకాకుళం మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన సాంఘిక శాస్త్ర విద్యా వైజ్ఞానిక సదస్సులో హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులు దివ్య, శిరీష ప్రతిభ కనబరిచారు. కొలోజియం ప్రాజెక్టును ప్రదర్శించి ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ దేవానంద రెడ్డితో ప్రశంసలు పొందారని హెచ్‌ఎం టి.కేశవరావు తెలిపారు. ప్రశంసా పత్రంతో పాటు జ్ఞాపికను అందజేసి అభినందించారని పేర్కొన్నారు.



కొలోజియం ప్రాజెక్టుతో విద్యార్థినులు

అభ్యంతరాలుంటే తెలియజేయండి

టెక్కలి: టెక్కలి నియోజకవర్గ పరిధి ఓటర్ల జాబితాలను బీఎల్‌వోలకు అందించామని, వీటిపై అభ్యంతరాలుంటే తన దృష్టికి తీసుకు రావాలని టెక్కలి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి నూరుల్ కమర్ అన్నారు. మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల విజయోత్సవ ర్యాలీ

కాశీబుగ్గ: సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం హామీ ఇవ్వడంతో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గణపతి, వేణుగోపాల్, మోహన్‌రావు, కుసుమ, శ్రీనివాస్, సునీత, మంజులా కుమారి తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో రుణాలు రెన్యువల్ చేసుకోవాలి

నందిగాం: తెంబూరు పీఏసీఎస్‌లో వ్యవసాయ రుణాలు తీసుకున్న రైతులు ఫిబ్రవరి నెలా ఖరులోగా రెన్యువల్ చేయించుకోవాలని పీఏసీఎస్ అధ్యక్షుడు కె.బాలకృష్ణారావు, సీఈవో ఎ.రామారావు ఒక ప్రకటనలో కోరారు. గత ఏడాది మార్చి నుంచి రెన్యువల్ చేసుకున్న రైతులంతా ఏడు శాతం వడ్డీతో తిరిగి రెన్యువల్ చేసుకుంటే ప్రభుత్వం అందించే వడ్డీ రాయితీ వర్తిస్తుందన్నారు. సకాలంలో రెన్యువల్ చేసుకోకుంటే 13 శాతం వడ్డీ చెల్లించాల్సి వస్తుందన్నారు.

బాధ్యతాయుతంగా పరీక్షలు నిర్వహించాలి

నరసన్నపేట: పాఠశాలల్లో ఎస్ఏ-3 పరీక్షలను బాధ్యతాయుతంగా నిర్వహించాలని ఎంఈవో లు ఉప్పాడ శాంతారావు, పేడాడ దాలినాయుడు సూచించారు. జమ్ము, తామరాపల్లి, ఉర్లాం పాఠశాలల్లో మంగళవారం పరీక్షలను పరిశీలించారు. అలాగే మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. వచ్చే ఏడాది నాటికి అడ్మిషన్లు జరిగేలా ప్రచారం చేయాలని సూచించారు.

ఎస్ఎస్ఏ నిధులు దారి మళ్లించొద్దు

నరసన్నపేట: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఉద్దేశించి సర్వశిక్షా అభియాన్ ద్వారా మంజూరైన నిధులను ఇతర అవసరాలకు మళ్లించవద్దని ఎస్ఎస్ఏ రాష్ట్ర ఆడిట్ బృంద సభ్యులు బి.సూర్య, విద్యాసాగర్ సూచించారు. మంగళవారం ఉర్లాం ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ఎస్ఎస్ఏ నిధులతో చేపట్టిన భవనాలు, ఎండీఎం గదులను పరిశీలించారు. విద్యార్థులకు బోధనోపకరణాల కొనుగోలుపై ఆరా తీశారు.


ఆమదాలవలస: టీడీపీ కార్యాలయంలో కేక్‌కట్ చేస్తున్న కూన రవికుమార్


టెక్కలి: నిమ్మాడలో అచ్చెన్నాయుడు..


అరసవల్లి: రిమ్స్‌లో పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న గొండు శంకర్


గార: కుమ్మరిపేటలో..

సందడిగా లోకేశ్ పుట్టినరోజు

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పుట్టిన రోజు కార్యక్రమాలు మంగళవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. టీడీపీ కార్యకర్తలు, నాయకులు కేకులు కట్ చూస్తూ, మిఠాయిలు పంచుతూ సందడి చేశారు. అన్నదానం, పండ్లు, రొట్టెల పంపిణీ, రక్తదాన శిబిరాల నిర్వహించారు. ఆలయాల్లో లోకేశ్ పేరున పూజలు, అర్చనలు చేయించారు.

- ఆంధ్రజ్యోతి బృందం


హిరమండలం: కేక్ కట్‌చేస్తున్న టీడీపీ నాయకులు


కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకుడు మామిడి గోవిందరావు


ఎచ్చెర్ల: టీడీపీ కార్యాలయంలో..


అరసవల్లి: కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి


జి.సిగడాం: కేక్ కట్‌చేస్తున్న టీడీపీ నాయకులు

ఎంజీఆర్ ఆధ్వర్యంలో..

పాతపట్నం: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పుట్టిన రోజు వేడుకలను స్థానిక ఎంజీఆర్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. బైక్‌ర్యాలీ చేపట్టి నీలమణి దుర్గమ్మ ఆల యంలో 108 కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. సీహెచ్‌సీలో రోగులకు రొట్టెలు పంపిణీ చేశారు.


రణస్థలం: లోకేశ్ పుట్టిన రోజు వేడుకల్లో..


నరసన్నపేట: కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి


పాతపట్నం: కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కలమట

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

ఎచ్చెర్ల: పొన్నాడ పంచాయతీ ముద్దాడపేట గ్రామానికి చెందిన రీసు అప్పన్న (50) మనస్తాపంతో మంగళవారం తన ఇంట్లోనే ఫ్యాన్ హుక్‌కు ఉరివేసుకుని మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎచ్చెర్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అప్పన్న 2022 జనవరి 29వ తేదీన తన భార్య అప్పమ్మ, అక్క, చెల్లిబోయిన రాజులను మద్యం మత్తులో విచక్షణ కోల్పోయి హతమార్చాడు. ఆ ఘటనలో తాను కూడా కత్తితో పొడుచుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడి... కొన్నాళ్లకు కోలుకున్నాడు. ఆ తర్వాత ఇతడిని కుటుంబ సభ్యులు దూరంపెట్టడంతో ఒంటరి జీవితాన్ని కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆనాటి జంట హత్య కేసుకు సంబంధించి కోర్టులో విచారణకు రావడంతో.. తీవ్ర మనస్తాపానికి గురై మద్యం మత్తులో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అప్పన్నకు ఇద్దరు కుమారులు కాగా.. ఇద్దరూ కూడా దూర ప్రాంతాల్లో ఉంటున్నారు. ఎస్ఐ వి.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బన్నువాడలో ఒకరు..

టెక్కలి రూరల్: బన్నువాడ గ్రామ సమీపంలో మంగళవారం సాయంత్రం చెట్టుకు ఉరి వేసుకుని చిన్న చేరివీధికి చెందిన మామిడి అప్పలనాయుడు (40) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. తాపీమేస్త్రీగా జీవనం సాగిస్తున్న అప్పల నాయుడు మంగళవారం ఉదయం ఇంటి నుంచి సైకిల్‌పై బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో కుటుంబసభ్యులు వెతుకుతుండగా బన్నువాడ సమీపంలో చెట్టుకు అతడి మృతదేహం వేలాడి ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. అయితే ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. అప్పలనాయుడికి భార్య ఈశ్వరి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ నర్సింగరావు తెలిపారు.

బారువా మాజీ సర్పంచ్ మృతి


చంద్రుడు(ఫైల్)

సోంపేట: సోంపేట థర్మల్ ఉద్యమంలో చురుగ్గా వ్యవహరించిన, టీడీపీ నుంచి మూడు సార్లు సర్పంచ్‌గా ఎన్నికైన బారువ గ్రామానికి చెందిన మడే శరత్‌చంద్రుడు(77) మంగళ వారం మృతి చెందారు. ఆయన మృతికి థర్మల్ పోరాట సమితి సభ్యులు, టీడీపీ నాయకులు సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

పరిశ్రమ గేటు ఎదుట మృతుడి బంధువుల ఆందోళన

రణస్థలం: పైడిభీమవరంలో ఓ రసాయన పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుడు సోమవారం ఆకస్మిక మృతి కలకలం రేపింది. సంబంధిత యాజమాన్యం పట్టించుకోకపోవడంతో బాధిత కుటుంబం, గ్రామస్థులు మంగళవారం పరిశ్రమ ఎదుట ఆందోళన చేశారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వివరాల్లోకి వెళ్తే.. విజయనగరం జిల్లా రేగిడి మండలం దేవుదల్ గ్రామానికి చెందిన కెంబూరు భాస్కరరావు(49) పైడిభీమవరంలోని ఓ రసాయన పరిశ్రమలో కొన్నేళ్లుగా పనిచేస్తున్నాడు. గత పదేళ్లుగా రణస్థలంలో ఉంటూ రాకపోకలు సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం కంపెనీలో విధులకు హాజరయ్యాడు. కొద్దిసేపటికే ఊపిరాడక అస్వస్థతకు గురైనట్టు తోటి కార్మికులు చెబుతున్నారు. హుటాహుటిన విజయనగరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే భాస్కరరావు మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. కానీ యాజమాన్యం తమకేమీ పట్టకుండా వ్యవహరించింది. దీంతో కుటుంబసభ్యులు, బంధువులు మంగళవారం ఉదయం పరిశ్రమ వద్దకు చేరుకొని ప్రశ్నించినా యాజమాన్య ప్రతినిధుల నుంచి స్పందన లేకుండా పోయింది. దీంతో మృతుడి బంధువులు పరిశ్రమ గేట్ వద్ద ఆందోళన చేపట్టారు. కాగా రూ.30 లక్షలు పరిహారంతో పాటు కుటుంబంలోని ఒక్కరికి ఉద్యోగం ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకరించడంతో బాధిత కుటుంబసభ్యులు మెత్తబడినట్టు సమాచారం. భాస్కరరావుకి భార్య ప్రభావతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రభావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జేఆర్ పురం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జలజీవన్ మిషన్ పనులు పరిశీలన

బూర్జ: ఇటీవల కాలంలో గ్రామీణ మంచినీటటి పథకం ఆధ్వర్యంలో నిర్వహించిన జలజీవన్‌మిషన్ పనులను కేంద్ర బృందం మంగళవారం ముమ్మరంగా తనిఖీలు చేసింది. బూర్జ, ఏపీ పేట, కేకే రాజపురం, గోపీదేవిపేట, అన్నంపేట, తిమడాం, కిలంతర గ్రామాలను సందర్శించారు. ఆయా గ్రామాల్లో కేం ద్ర బృందం ప్రతినిధులు నవీన్‌పూరి, సంజీవ్‌కుమార్ పర్యటించారు. సర్పంచ్ కొరికాన వెంకటశివ సీతారామరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నాగరాజు, పీఆర్ జేఈ మౌనిక, ఈవోపీఆర్డీ విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి పద్మావతి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్‌సీ కుటుంబానికి సహాయ నిధి అందజేత

శ్రీకాకుళం క్రైం: ఇటీవల అనారోగ్యంతో మరణించిన హెడ్‌కానిస్టేబుల్ కుటుంబానికి మంగళవారం ఎస్పీ జీఆర్ రాధిక పోలీసు సహాయ నిధిని అందజేశారు. ఈ మేరకు హెచ్‌సీ భార్య సతీమణి, కుటుంబ సభ్యులకు మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో రూ.75 వేలు నగదు అందజేశారు.

సంక్షేమానికి పెద్దపీట

శ్రీకాకుళం క్రైం: సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. ఇప్పిలి గ్రామంలో సర్పంచ్ ఆధ్వర్యంలో మంగళవారం ఆసరా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఇప్పిలి బాబు, ఎంపీడీవో రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అధిక దిగుబడి సాధించాలి

సోంపేట: తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించేలా వ్యవసాయం చేయాలని వ్యవసాయశాఖ ఏడీ కె.జగన్మోహనరావు అన్నారు. నూకలూరుకు చెందిన అభ్యుదయ రైతు పెద్దింటి ఢిల్లీరావు, నూకల పున్నయ్య వ్యవసాయ క్షేత్రాల్లో పండిస్తున్న గులిరాగి సాగును మంగళవారం పరిశీలించారు. కార్యక్రమంలో ఏవో బి.నర్సింహమూర్తి, రైతులు ఉన్నారు.

మంత్రి సభలో మహిళల నిర్బంధం


హైస్కూల్ గేటు మూసివేయడంతో ఇబ్బందిపడుతున్న మహిళలు

శ్రీకాకుళం క్రైం: ఇప్పిలి గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో మంగళవారం నిర్వహించిన ఆసరా కార్యక్రమానికి ఇప్పిలి, కుందువానిపేట, కనుగులవానిపేట, బలివాడ నాలుగు పంచాయతీల నుంచి మహిళలను వైసీపీ నాయకులు తరలించారు. ఉదయం 10 గంటలకు మంత్రి ధర్మాన ప్రసాదరావు సమావేశం నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమానికి మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రూప్‌లో ఉన్న ప్రతీ మహిళ హాజరు కావాలని లేని పక్షంలో రుణాలు నిలిచిపోతాయని చెప్పి వారిని సమావేశానికి తీసుకొచ్చారు. అయితే సమావేశం ప్రారంభమైన తర్వాత మంత్రి ధర్మాన మాట్లాడక ముందే ఇంటి దారిపట్టారు. వారిని బలవంతంగా సభలో కూర్చొబెట్టేందుకు ఆయా సంఘాల ప్రతినిధులు అవస్థలు పడ్డారు. గేట్ వేసేసి మహిళలు బయటకు వెళ్లనీయకుండా నిర్బంధించారు. అప్పటికీ మహిళలు ఇంటి ముఖం పడుతుండడంతో మంత్రి అసహనం వ్యక్తం చేశారు.

27వ రోజుకు చేరిన బెంతు ఒరియాల దీక్షలు


రిలే దీక్షలో తలతంపర గ్రామానికి చెందిన బెంతు ఒరియాలు

కవిటి: బెంతు ఒరియా సామాజిక వర్గానికి జరుగుతున్న అన్యాయానికి నిరసనగా కవిటిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు 27వ రోజుకు చేరాయి. మంగళవారం కంచిలి మండలం తలతంపర పంచాయతీ లండపుట్టుగ గ్రామానికి చెందిన బెంతొరియాలు దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బెంతు ఒరియా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ మంజూరు కావడం లేదని, కనీసం నివాస ధ్రువ పత్రాలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తలతంపర సర్పంచ్ జగబందు దొళాయి, మాజీ సర్పంచ్ పురుషోత్తం దొళాయి, ప్రభాకర్ దొళాయి, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు

పాఠశాల దుస్థితిపై జేసీ ఆగ్రహం


మున్సిపల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జేసీ

ఆమదాలవలస: జగ్గుశాస్త్రులపేట పురపాలక ప్రాథమిక పాఠశాల పరిసరాల దుస్థితిపై జేసీ నవీన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల పోలింగ్ స్టేషన్ల పరిశీలనలో భాగంగా మంగళవారం ఆయన ఈ పాఠశాలను పరిశీలించారు. కనీస వసతులు కూడా లేకపోవడంతో మున్సిపల్ అధికారులపై మండిపడ్డారు. తక్షణమే ఇక్కడ మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రవిసుధాకర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయాల్లో పూజలు




శ్రీకాకుళం కల్చరల్: మాస శివరాత్రి సందర్భంగా నక్కవీధిలోని ఉమాజఠలేశ్వర స్వామి ఆలయంలో ఆరుద్ర నక్షత్ర పూజలు నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు, అలంకరణ అర్చకులు బి.అశ్విని కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. అదే విధంగా నాగావళి నదీతీరంలో ఉన్న ఉమారుద్ర కోటేశ్వరాలయంలో అర్చకులు రాంజీ ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు. అర్చకులు పెంటా శ్రీధర్ శర్మ ఆధ్వర్యంలో విజయ గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

టీడీపీ, కాంగ్రెస్ పార్టీలకు యూటీఎఫ్ ఆహ్వానం


షర్మిలకు ఆహ్వానపత్రాన్నిస్తున్న యూటీఎఫ్ నాయకులు

అరసవల్లి: ఉద్యోగులకు, ఉపాధ్యాయుల సమస్యలపై యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 28న రాజమండ్రిలో నిర్వహించనున్న సభకు హాజరుకావాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను ఆ సంఘ నాయకులు మంగళవారం కలిసి ఆహ్వానించారు. వారిని కలిసినవారిలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు చౌదరి రవీంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శ్రీరామ్మూర్తి, గౌరవాధ్యక్షుడు కె.వైకుంఠరావు, కోశాధికారి బి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీసీల ప్రగతి టీడీపీతోనే సాధ్యం

లావేరు: బీసీల ప్రగతి టీడీపీతోనే సాధ్యమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు అన్నారు. మంగళవారం కొత్తరౌతుపేటలో నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆదరణ, విదేశీ విద్యకు ప్రోత్సాహం, స్కాలర షిప్స్, బీసీ కార్పొరేషన్ ద్వారా అనేక పథకాలు అమలు చేసినట్టు గుర్తు చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉన్న పథకాలు రద్దు చేసి బీలకు తీరని అన్యాయం చేశారని మండిపడ్డారు. కార్యక్రమంలలో టీడీపీ నాయకులు లంక నారాయణరావు, గొర్లె శ్రీనివాసరావు, ఆర్.ప్రకాశరావు, గురిజాపు రాము, తదితర బీసీ సంఘ నాయకుల పాల్గొన్నారు.

ఏఐసీటీఈ గుర్తింపు నిబంధన సరికాదు



ర్యాలీ నిర్వహిస్తున్న ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్య ప్రతినిధులు

ఎచ్చెర్ల: యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల్లో సాంకేతిక కోర్సులకు ఏఐసీటీఈ గుర్తింపు పొందాలన్న నిబంధనలను విరమరించుకోవాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ అనుబంధ కళాశాలల యాజమాన్య ప్రతినిధులు, డైరెక్టర్స్, ప్రిన్సిపాల్స్ డిమాండ్ చేశారు. నెల రోజుల కిందట రాష్ట్ర ఉన్నత విద్యామండలి ద్వారా డిగ్రీ కళాశాలలకు పంపిన మార్గదర్శకాలను వ్యతిరేకిస్తూ వర్సిటీ ఆవరణలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఏపీ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ పిలుపు నిర్వహించిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పొన్నాన జయరామ్, కార్యదర్శి కోట మురళీధర్, కోశాధికారి బింగి చిట్టిబాబు మాట్లాడుతూ.. యూజీసీ నిబంధనల మేరకు డిగ్రీ కళాశాలలు వర్సిటీ పర్యవేక్షణలో నడుస్తున్నాయని చెప్పారు. కొత్తగా ఏఐసీటీఈ అనుమతులు తీసుకోవాలనడం సరికాదన్నారు. 2024-25 విద్యా సంవత్సరం నుంచి బీబీఏ, బీసీఏ, బీఎంఎస్ కోర్సులకు ఏఐసీటీఈ అనుమతి పొందాలంటే ఇంజనీరింగ్ కళాశాలల ప్రమాణాలు పాటించాల్సి ఉంటుందన్నారు. అనంతరం వీరంతా బీఆర్ఏయూ వీసీ కేఆర్ రజనిని కలసి వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో ప్రైవేటు కళాశాలల యాజమాన్య ప్రతినిధులు పి.పాపారావు, ఎం.మోహనరావు, టి.లక్ష్మీపతి, ఎం.నర్సింగరావు, ఎస్.మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

జి.సిగడాం: కేంద్ర ప్రభుత్వ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు, విశ్వకర్మ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ వజ్జపర్తి రఘురాం అన్నారు. మంగళవారం జి.సిగడాం, మదుపాంలో వికసిత్ భారత్ సంకల్పయాత్రను నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మీసాల రామకృష్ణ, గట్టెం అప్పలరాజు, పొగిరి దాశరధి, ఈవోఆర్డీ ఎస్.శ్రీనివాసులు, ఏపీవో సీహెచ్ సత్యనారాయణ, ఏఈ శ్రీవల్లి, సీహెచ్‌వో తదితరులు పాల్గొన్నారు.

● **సరుబుజ్జిలి:** కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలు ప్రతి ఒక్కరికి అందినప్పుడే ప్రభుత్వ లక్ష్యాలు సాధ్యపడతాయని బీజేపీ నియోజకవర్గం కన్వీనర్ పేడాడ సూరపునాయుడు కోరారు. వికసిత్ భారత్ కార్యక్రమంలోని మండలంలోని పురుషోత్తపురం గ్రామంలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్య క్రమంలో పశుసంవర్ధకశాఖ ఏడీ సుబ్రహ్మణ్యం, ఉపాధి హామీ ఏపీవో పార్వతి, వైద్యాధికారి జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఆయుష్మానుభవ హెల్త్‌కార్డులు పంపిణీ చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఎచ్చెర్ల: తోటపాలెం సమీపంలోని అఖిన్‌ఖాన్ పేట వద్ద మంగళవారం పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి 16 మందిని అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.26 వేలు, సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా వీరిలో సచివాలయ వలంటీరు కూడా ఉన్నట్టు సమాచారం.


గుజరాతీపేట: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో..

ఘనంగా నేతాజీ జయంతి

గుజరాతీపేట: నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నేతాజీ సుభాష్ చంద్రబోష్ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా నేతాజీ చిత్రపటానికి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్ పూలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ వీవీజీఎస్ శంకరరావు, లైబ్రేరియన్ ఎస్‌వి.రమణమూర్తి, పి.భానుమతి, పి.రామ్మోహన్, టి.రాంబాబు, గణేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా నేతాజీ జయంతి కార్యక్రమాలు నిర్వహించారు.


టెక్కలి: జనసేన కార్యాలయంలో..


నందిగాంలో..


ఇచ్ఛాపురం రూరల్: ఈనేసుపేటలో..

నేడు బహిరంగ వేలం పాట

అరసవల్లి: ఆరోగ్య ప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి రథసప్తమి సంబంధించి క్యూలైన్లు, విద్యుత్తు దీపాలంకరణ, షామియానాలు, కార్పెట్లు, దేవాలయానికి రంగులు వేసేందుకు లేబర్ ఖర్చులకు గాను బుధవారం టెండర్ కమ్ బహిరంగవేలం నిర్వహించనున్నట్టు ఈవో వి.హరిసూర్యప్రకాష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వేలంలో పాల్గొనాలనుకునే వారు క్యూలైన్లు, విద్యుత్తు దీపాలంకరణ, షామియానాలు, కార్పెట్లు వేసేందుకు రూ.50,000, దేవాలయ ప్రాంగణాలకు రంగులు వేసేందుకు రూ.20,000 డిపాజిట్ చెల్లించి పాల్గొనాలన్నారు. ఇతర వివరాలకు దేవస్థానం కార్యాలయంలో గాని, 08942-222421, 8778914660 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు. అలాగే స్వామివారికి భక్తులు సమర్పించు తలనీలాలు పోగుచేసుకొనే ఏడా కాలపరిమితపై బుధవారం టెండర్ కమ్ బహిరంగ వేలం వేయనున్నట్టు, ఇందుకు రూ.5లక్షలు డిపాజిట్ చెల్లించి పాల్గొనాలని ఈవో తెలిపారు.

ఆర్థిక క్రమశిక్షణ లేని ప్రభుత్వం

అరసవల్లి: వైసీపీ ప్రభుత్వానికి ఆర్థిక క్రమశిక్షణ లేకపోవడం వల్లే టీడీపీ హయాంలో చేపట్టిన పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయని మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి అన్నారు. మంగళవారం తమ నివాసంలో వారు విలేకరులతో మాట్లాడారు. టీడీపీ హయాంలో నగరంలో తారు, సిమ్మెంటు రోడ్లు వేయించామని, శ్రీకూర్మం దేవస్థానాన్ని దృష్టిలో ఉంచుకుని బ్రహ్మాండమైన తారురోడ్డు వేయడం జరిగిందని, అరసవిల్లి, కాజీపేట రూరల్‌లో సిమెంటు రోడ్లు వేశామని గుర్తుచేశారు. ప్రత్యేకించి శ్రీకాకుళం, గుజరాతీపేటను కలిపే నాగావళిపై వంతెనను పూర్తి చేశామన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఏ పనులూ పూర్తి కాలేదని, గార దగ్గరలో ఉన్న స్టేట్ హైవేను కలుపుతూ వంశధార నదిలో అన్ని కాలమ్స్ పూర్తి చేసినా, వాటిపై కనీసం స్లాబ్స్ కూడా వేయలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉందన్నారు. సింగుపురం వద్ద నర్సింగ్ కళాశాల భవనం దాదాపు పూర్తి కావచ్చిందని, దానిని కూడా పూర్తి చేయలేదని, కోడి రామ్మూర్తి స్టేడియం నిర్మాణం, శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస రోడ్డు, గార మండల శివారు గ్రామాలకు సాగునీరు, పాత్రునివలస దగ్గర టిడ్కో ఇళ్ల నిర్మాణం ఏదీ పూర్తి కాలేదని విమర్శించారు. ఇది ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు.

ఇది రైతు దగాకోరు ప్రభుత్వం

అరసవల్లి: రాష్ట్రంలో కొనసాగుతున్నది రైతు దగాకోరు ప్రభుత్వమని కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి విమర్శించారు. జిల్లాలో సాగునీటి సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ అలసత్వాన్ని నిరసిస్తూ స్థానిక వంశధార సర్కిల్ కార్యాలయం వద్ద మంగళవారం ఉదయం జిల్లా కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిరసన, ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ- ప్రాజెక్టులు పూర్తి కాదు కదా, కనీసం మరమ్మతులు కూడా చేయని దుస్థితి నెలకొందన్నారు. కనీసం పంట కాలువల్లో పూడిక తీయడానికి కూడా ఒక్క రూపాయి కేటాయించలేదని, గొట్టా బ్యారేజీ ఎడమకాలువ పూర్తిగా పూడుకుపోయిందన్నారు. రైతులపై జగన్‌రెడ్డికి ఎంత ప్రేమ ఉందో ఈ పరిస్థితి తెలియజేస్తోందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బి.ఉమామహేశ్వరరావు, పాకలపాటి రవిరాజు, సీహెచ్ గోవింద, పైడి వేణుగోపాలం తదితరులు పాల్గొన్నారు.

4.54 లక్షల మందికి లబ్ధి

కలెక్టరేట్: ఆసరా పథకం కింద జిల్లాలో 4.54 లక్షల మంది పొదుపు సంఘాల్లోని మహిళలకు రూ.309.77కోట్ల లబ్ధి చేకూరుతుందని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. మంగళవారం స్థానిక బాపూజీ కళామందిర్‌లో దీనికి సంబంధించి నమూనా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో నరసన్నపేట ఎమ్మెల్యే కృష్ణదాస్, పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి, ఎమ్మెల్సీ నర్తు రామారావు, డీఆర్డీఏ పీడీ విద్యాసాగర, లీడ్ బ్యాంకు మేనేజర్ సూర్యకిరణ్, మెప్మా పీడీ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

కంచిలి: జాడుపూడి మెయిన్ వీధిలో రాధాకృష్ణ మందిరం నుంచి మెయిన్ వీధి వరకు ఉపాధి హామీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎంపీపీ పైల దేవదాసు రెడ్డి, సర్పంచ్ పి.ద్రాక్ష మంగళవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జామి జయ, కె.సురేష్, గ్రామ పెద్దలు పి.సోమేశ్వరరావు, జామి నూకయ్య, పి.చిన బాబు, బి.దేవరాజు, జి.జగ్గారావు, పి.కూర్మారావు, పి.కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

షర్మిలను కలిసిన సత్యవతి


సత్యవతిని సత్కరిస్తున్న షర్మిల

ఆమదాలవలస: పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను పీసీసీ ఉపాధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. మంగళవారం జిల్లాలో పర్యటకు వచ్చిన షర్మిల కలిసి జిల్లాలో నెలకొన్న సమస్యలు వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు లఖినేని నారాయణరావు, సాయిరాం, బసవ షన్ముఖరావు, బొత్స రమణ, గొల్లపల్లి దాలయ్య పాల్గొన్నారు.

జగన్ విధానాలు నచ్చకే కాంగ్రెస్‌లోకి..

ఇచ్ఛాపురం రూరల్: ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి విధానాలు నచ్చకే వైసీపీని వీడి కాంగ్రెస్‌లో చేరానని కేసుపురం ఎంపీటీసీ మాసుపత్రి చక్రవర్తి రెడ్డి అన్నారు. మంగళవారం షర్మిల ఇచ్ఛాపురంలో పర్యటించిన సందర్భంగా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు ప్రభుత్వం అని చెప్పుకున్న జగన్.. తితలీ తుఫాన్ సమయంలో కొట్టుకుపోయిన 11 గ్రొయిన్లు నిర్మిస్తామని చెప్పి ఇప్పటికీ నిర్మించలేదని, కేశుపురం గ్రోయిన్ నిర్మించినా, వాటి బిల్లులు అందక కాంట్రాక్టర్ నిట్టూరుస్తున్నారన్నారు. ఈ ప్రభుత్వంపై అసంతృప్తితో మండలంలో ఆరుగు ఎంపీటీసీలు, సర్పంచులు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సీపీఎస్, జీపీఎస్ వద్దని, ఓపీఎస్‌ను కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో చేర్చాలని పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు షర్మిలను కోరారు. సహారాలో డిపాజిట్లు చేసిన ఖాతాదారులకు ఇప్పటి వరకు రూపాయి కూడా చెల్లించలేదని, సీఎం జగన్ ఇచ్చిన హామీ.. హామీగానే మిగిలిందన్నారు. మీరైనా మాకు న్యాయం చేయాలని సహార ఖాతాదారులు, ఏజెంట్లు ఆమెకు విన్నవించారు.

పూర్వ విద్యార్థుల సాయం

ఇచ్ఛాపురం రూరల్: తేలుకుంచి గ్రామంలో ఇటీవల తల్లి మరణించడం, తండ్రి కూడా అందుబాటులో లేకుండా అనాథులుగా మిగిలిన చిన్నారులను ఈదుపురం హైస్కూల్‌లో 2006-07 పూర్వ విద్యార్థులు సాయం అందించారు. ఈ మేరకు రూ. 12 వేలు వారికి అందించారు.